సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



అలరించిన డాగ్ షో

విశాఖ ఎంజీఎం గ్రౌండ్‌లో దేశ, విదేశీ జాతుల శునకాలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.


8లో



'డ్రాగన్' సిరులు

అనకాపల్లి జిల్లాలోని మెట్ట భూముల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు కురిపిస్తోంది. రైతులకు మంచి ఆదాయాన్నిస్తోంది.

8లో



మంచు దుప్పటి

రాజవొమ్మంగి పరిసరాల్లో ఆదివారం వేకువ జామునుంచి మంచు దట్టంగా కురిసింది. శీతాకాలాన్ని తలపించింది.

న్యూస్‌రీల్

మోదమ్మ భక్తులకు అన్నసమారాధన



వడ్డిస్తున్న కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. వీరికి ఆలయ కమిటీ ప్రసాదాలను పంపిణీ చేసింది. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేసింది. పాడేరుకు చెందిన వర్తక సంఘం నేత కల్లూరు గోవింద్ 300మందికి మధ్యాహ్నం భోజనం సమకూర్చారు.ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు ముకుందు, కారం దేముడు,శివరాత్రి శ్రీనివాస రావు, సిద్ధనాతి కొండలరావు, కొట్టగుళ్లి రామారావులు భక్తులకు వడ్డించారు. భవానీ మాలధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

16 వరకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు, లింగంపల్లి–విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు రద్దు చేశారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాల్సిన ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకోనుంది.

రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ సత్తా



విజేతలతో కోచ్ మురళీ, రోలర్‌స్కీ ఫౌండర్ సురేంద్రరెడ్డి

దొండపర్తి : రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. గుజరాత్‌లోని బరోడాలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నేషనల్ చాంపియన్ షిప్ జరిగింది. ఇందులో విశాఖకు చెందిన వి.ఉదయశ్రీ తేజ మూడు బంగారు పతకాలు సాధించగా, ఆర్.చాణక్య రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకున్నారు. జి.నూతన్ మూడు స్వర్ణాలు సాధించారు. కోచ్ మురళీ ఆధ్వర్యంలో ఏపీకి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది. ఏపీ రోలర్ స్కీ ఫౌండర్ సురేంద్ర రెడ్డి ప్రోత్సాహంతో ఈ ఫలితాలు సాంతమయ్యాయని కోచ్ మురళీ తెలిపారు. స్వర్ణ, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను సురేంద్రరెడ్డి అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

మన్యంలో వానర బీభత్సం

రంపచోడవరం డివిజన్ పరిధిలో కోతుల ఆగడాల కట్టడికి అటవీశాఖ, ఐటీడీఏ కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఇప్పటికే శాంపిల్ సర్వే నిర్వహించిన అటవీశాఖ అధికారులు ఎక్కడెక్కడ వీటి ప్రభావం ఎక్కువగా ఉందనే విషయాన్ని గుర్తించారు. పంటలను నాశనం చేయడంతోపాటు జనావాస ప్రాంతాల్లో దాడులకు దిగుతుండటంతో ప్రజల నుంచి అందిన వినతుల నేపథ్యంలో నియంత్రణపై అటవీశాఖ దృష్టి పెట్టింది.



రాజవొమ్మంగి ప్రాంతంలో జనవాసాల మధ్య కోతుల గుంపు

- పెరిగిన కోతుల సంచారం
- పంటపొలాల నాశనం
- కట్టడికి రంగంలోకి దిగిన అటవీశాఖ
- ఇప్పటికే శాంపిల్ సర్వే పూర్తి

రంపచోడవరం: కోతులను కట్టడి చేసేందుకు అటవీశాఖ రంగంలోకి దిగింది. ఏజెన్సీలోని ఆరు రేంజ్‌ల పరిధిలో కోతుల సంచారంపై ఇటీవల శాంపిల్ సర్వే నిర్వహించింది. ఎక్కడెక్కడ కోతుల సంచారం ఎక్కువ ఉందనే దానిపై నిర్ధారణ చేసేందుకు ఈ సర్వే చేపట్టారు. కోతులు పంటలను నాశనం చేయడంతోపాటు రైతులపై దాడులకు పాల్పడుతున్నాయి. గ్రామాల్లో కూడా వీటి వల్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నియంత్రణ చర్యలపై సమీక్ష

ఏజెన్సీలో కోతులను కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, డీఎఫ్‌వో నరేంద్రియన్ సమీక్షించారు. జనవాసాల్లో కోతుల సంచారాన్ని కట్టడి చేసేందుకు చేపట్టాల్సి చర్యలపై చర్చించారు. దీనిలో భాగంగా మొదటిగా ఏజెన్సీలో ఎన్ని కోతులు గుంపులు ఉన్నాయి అనే లెక్కలు తేల్చాలని నిర్ణయించారు.

- రంపచోడవరం, మారేడుమిల్లి, ఇందుకూరు, పోక్సుపేట, అడ్డతీగల, రాజవొమ్మంగి అటవీ రేంజ్‌ల పరిధిలో కోతుల గణనకు ఒక్కో దానిలో ఐదు టీమ్‌లు పనిచేశాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి రెండున్నర గంటల పాటు కోతుల కదలికలపై సర్వే నిర్వహించారు.
- పోక్సుపేట నుంచి సీతపల్లి ఆలయం వరకు రోడ్డుకు ఒకవైపు 252, మరోవైపు 52 కోతులు ఉన్నట్లు సర్వేలో గుర్తించామని పోక్సుపేట రేంజ్ అధికారి కరుణాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను ఆయన తెలిపారు. మగ, ఆడ, చిన్న, పిల్ల కోతులు ఉంటాయన్నారు. వీటికి ఆల్ఫా (మగ) రకం, రిసస్ మకాక్ (పండుకోతి) నాయకత్వం వహిస్తాయని ఆయన వెల్లడించారు. హనుమాన్ లంగర్ (కొండముచ్చు) సంతతి కూడా ఎక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. గంగవరం– పాత రామవరం వరకు కోతుల ప్రభావం లేనట్టుగా సర్వేలో తేలిందన్నారు. ఐ.పోలవరం నుంచి గంగవరం వరకు వెళ్లే మార్గంలో కోతుల సంతతి ఉన్నప్పటికీ వీటి సంఖ్య తక్కువగా ఉందన్నారు.

నియంత్రణకు కార్యాచరణ

ఏజెన్సీలో కోతుల సమస్య ఎక్కువగా ఉంది. అటవీశాఖ, ఐటీడీఏ సంయుక్తంగా కోతులను కట్టడి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందిస్తున్నాం. శాంపిల్ సర్వే అనంతరం మరోసారి ఐటీడీఏ పీవోతో కలిసి చర్చిస్తాం. కేంద్రప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా కోతుల కట్టడికి చర్యలు తీసుకుంటాం.

– నరేంద్రియన్, డీఎఫ్‌వో, రంపచోడవరం

అందాల మెరుపులు



కొమ్మాది (విశాఖ): శ్రీమతులు చీరకట్టులో తళుకులీనారు. సంప్రదాయానికి ఆధునికతను మేళవించి హొయలు పోయారు. అతివల సోయగాలతో సాగర తీరం మరింత శోభను సంతరించుకుంది. బీచ్‌రోడ్డులోని తిమ్మాపురంలో గల వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం మిస్సెస్ వైజాగ్–2023 పోటీలు సందడిగా సాగాయి. ఇందులో 26 మంది మగువలు పోటీపడ్డారు. ఈ సందర్భంగా కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ మిస్సెస్ వైజాగ్–2023 పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతకు శ్రీలంక, ద్వితీయ విజేతకు నేపాల్, తృతీయ విజేతకు గోవా పర్యటనకు పంపిస్తామన్నారు. 2015లో ప్రారంభమైన కల్చరల్ సెంటర్‌లో 1,400 మందికి సభ్యత్వం ఉందన్నారు. కార్యక్రమంలో కల్చరల్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఎంఎస్ఎన్ రాజు, సహాయ కార్యదర్శి ఎస్. అశోక్‌రెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మెహర్ కుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



అందాల పోటీల్లో పాల్గొన్న శ్రీమతులు

బాధ్యతగా నాణ్యమైన సేవలు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఎలక్ట్రికల్ వర్కర్లు, ప్లంబర్లు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు సామాజిక బాధ్యతగా సేవలందించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. జిల్లాలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్క ర్ల జిల్లా యూనియన్ సమావేశాన్ని ఆదివారం మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, కుజ్జెలి సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కార్మికశాఖ అధికారి సూరిబాబు, నిర్వాహక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దానేకుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పాల్‌రాజ్, పలు జిల్లాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

జిల్లా ఎలక్ట్రికల్,ప్లంబర్ వర్కర్ల యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.సంఘ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ అనిఫ్,ఉ పాధ్యక్షుడిగా వంతాల గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా సందడి దామోదరం, కార్యదర్శిగా ఎడ్లపల్లి పోసిబాబు, కోశాధికారిగా మఠం స్వామినాయుడు, ఉప కోశాధికారిగా ఉగాదినాయుడు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు,కిల్లు కృష్ణబాబు,గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,హరిబాబు,కృష్ణారావు పాల్గొన్నారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న దర్శకుడు మహా వెంకటేష్

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రదర్శించిన చిత్రాలను స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడిగా మారానని చిత్ర దర్శకుడు మహా వెంకటేష్ అన్నారు. రేసపువానిపాలెంలో డాక్టర్ ఎల్‌బీ కాలేజ్ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య ఎస్.ఎ.డి పాల్ అధ్యక్షతన ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలోని యువత సినీ రంగం వైపు వెళ్లడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తన సినీ ప్రయాణానికి విశాఖలోనే తొలి అడుగులు పడ్డాయని.. సామాజిక బాధ్యతతో సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో మార్టిన్ లూథర్ కింగ్‌ను ఈ నెల 27న విడుదల చేస్తున్నామని, ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా తాను వ్యవహరించినట్లు చెప్పారు. నరవ ప్రకాష్ కోరిక మేరకు విశాఖలో ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తాననఇచెప్పారు. డాక్టర్ బాబ్జీ, చాట్ల బాబూరావు, ప్రభు, డాక్టర్ అర్చన, రజనీ కాంత్, హుస్సేన్, సత్యవతి పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మురళి



హాజరైన పొదుపు సంఘాల మహిళలు

డీఆర్‌డీఏ పీడీ మురళి

గంగవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ మురళి కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ డెవలప్ మెంట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ప్రయోజనాలు, బ్లాకడెవలప్‌మెంట్ కార్యక్రమంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన మహిళలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 రకాల కులవృత్తుల వారి కోసం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారపు పావని మాట్లాడుతూ ఇంటి పెరటిల్లో కాయకూరలు పెంచి వాటి ద్వారా కూడా ఆదాయం పొందవచ్చన్నారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఎం జేమ్స్ , ఉపాధి ఏపీఓ కృష్ణంరాజు, ఎంఈవో మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మన్యంలో వీకెండ్ సందడి



కొత్తపల్లి జలపాతానికి దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు



చాపరాయిలో జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. వంజంగి హిల్స్, డల్లాపల్లి శిఖర ప్రాంతాల్లో సూర్యోదయం, పొగమంచు, మేఘాల అందాలను పర్యాటకులు తిలకించారు.

చాపరాయిలో..

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఉదయం ఆరు గంటలకు తరలివచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. చిరు వ్యాపారులకు మంచి ఆదాయం వచ్చింది.

అరకులోయలో..

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు పర్యాటకుల తాకిడి మొదలైంది. వారం రోజులుగా వీరి సంఖ్య పెరిగింది. గిరిజన మ్యూజియాన్ని సుమారు 1200 మంది, పద్మాపురం ఉద్యానవనాన్ని 520 మంది సందర్శించినట్లు సంబంధింత అధికారవర్గాలు తెలిపాయి.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతానికి ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు.

జెండాకొండపై..

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎత్తైన శిఖరంగా గుర్తింపు పొంది, పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మపర్వతం (జెండాకొండ)పై ఆదివారం పర్యటకులు సందడి చేశారు. శనివారం రాత్రి ఓలుబెడ్డా గ్రామం మీదుగా కొండపైకి కాలినడకన వెళ్లారు. రాత్రి గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేశారు. సూర్యోదయం, మంచు అందాలను తిలకించారు. థింసా రాళ్లు, తేనెపట్టు గుహలను తిలకించారు.

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు తాకిడి పెరిగింది.. గత రెండు నెలలుగా సందర్శిత ప్రాంతాలన్నీ వెలవెలబోయాయి. మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తుండడంతో పర్యాటక ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ఆదివారం గుహలను సుమారు రెండు వేలమంది తిలకించగా, రూ.1.53 లక్ష ఆదాయం వచ్చిందని సిబ్బంది తెలిపారు. తాటిగుడ, సరియా, కటికి, చిట్టంపాడు జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. డముకు వ్యూపాయింట్ నుంచి పర్యాటకులు ప్రకృతి అందాలను వీక్షించారు.



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



సీతమ్మ పర్వతంపై సందర్శకుల గుడారాలు



గిరిజన మ్యూజియం వద్ద సందర్శకులు



సరియా జలపాతం వద్ద పర్యాటకుల సందడి

పాపికొండలకు పర్యాటకుల తాకిడి



పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి



లాంచీలో సందర్శకుల వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

వీఆర్ పురం: పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది.ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. గతనెల వరకు గోదావరి వరదలతో పర్యాటకం నిలిచిపోయింది. ఈనెల ఒకటో తేదీ నుంచి పాపికొండల పర్యాటక బోటింగ్‌ను అధికారికంగా పునఃప్రారంభించారు. ప్రారంభంలో రెండు బోట్లు 100 మంది పర్యాటకులతో పాపికొండల వీక్షణకు వెళ్లేవి.ఆదివారం ఏడు బోట్లలో 360 మందికి పైగా పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్, పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాల్లో సందడి నెలకొంది.

గర్భిణులను డోలీలో తరలింపు

సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు





గర్భిణులు దేవకమ్మ, చిలకమ్మను డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు: మండలంలోని దోడిపుట్టు పంచాయతీ చీడిచంప గ్రామానికి చెందిన పాంగి చిలకమ్మకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు డోలీలో ఏడు కిలోమీటర్లు మోసుకొని కుమ్మడిపుట్టు రోడ్డు వరకు తీసుకువచ్చారు.అక్కడినుంచి 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పింది. రోడ్డు సదుపాయం ఉంటే ఇబ్బందులు పడేవారం కాదని గ్రామస్తులు పాంగి రాజు, దశరథ్, కామేష్, బీమేష్, దేవరాజ్, పలుసు కోరారు.

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ రెంజెలమామిడిలో గర్భిణి బొండా దేవకమ్మకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో డోలీలో ఆస్పత్రికి తరలించారు. గ్రామం నుంచి గుల్లేలు వరకు రెండు కిలోమీటర్ల మేర తీసుకువచ్చి అక్కడి నుంచి వాహనంలో గోమంగి పీహెచ్‌సీకి తరలించారు. వెంటనే వైద్య సిబ్బంది సేవలందించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గౌతమ్, అజిత్‌కుమార్

అనంతగిరి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాస్థాయి (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని అనకాపల్లి, పరవాడ సాంస్కృతిక గ్లోబల్ స్కూలులో శనివారం జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు పాంగి గౌతమ్, వి.అజిత్‌కుమార్ అండర్–17 విభాగం షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని, ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు కోచ్ రాజాబాబు తెలిపారు. అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామానికి పాంగి గౌతమ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు భీమన్న, సీతతో పాటుస్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ పోర్టుకు ఎనలేని ఖ్యాతి

తాటిచెట్లపాలెం: విశాఖ పోర్టు ట్రస్ట్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాలగ్రామపురంలోని సీతారామ కళ్యాణమండపంలో హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపోర్టు ట్రస్ట్ మాజీ ట్రస్టీ బీసీహెచ్ మసేను మాట్లాడుతూ దేశంలోని అన్ని పోర్టులలో విశాఖ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, ఉద్యోగుల సహకారంతో నేడు ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. పోర్టును కాపాడు కోవడానికి ప్రతి ఉద్యోగి ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్నమైందన్నారు.

'ప్రపంచ శాంతి.. ఇస్కఫ్ లక్ష్యం'

దాబాగార్డెన్స్: ప్రపంచ శాంతి లక్ష్యంగా ఇస్కఫ్ ముందుకు సాగుతోందని ఆ సంస్థ జాతీయ సమితి చైర్మన్ భానుదేబ్ దత్తా అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర దేశాలతో మన దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, స్నేహబంధాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత ఇస్కఫ్ లీడర్‌షిప్‌లోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన ఆలోచనలతో దేశంలోని అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతిక సత్సంబంధాలు బలోపేతం అవుతున్నట్లు చెప్పారు.

'డ్రాగన్' సిరులు

సంప్రదాయ పంటలతో ఆశించిన ఆదాయం రాకపోవడంతో జిల్లాలో రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారిస్తున్నారు. విదేశీ పంటలు కూడా సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక లాభాలిచ్చే డ్రాగన్‌ఫ్రూట్ పంటను సైతం సాగు చేస్తున్నారు.

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 50 ఎకరాల విస్తీర్ణంలో సాగు
- అనకాపల్లి జిల్లాలో 20 ఎకరాల్లో పంట
- ఒకసారి నాటితే నుంచి 25 ఏళ్ల వరకు దిగుబడి
- జిల్లాలో విస్తరిస్తున్న సాగు

దేవరాపల్లి: జిల్లాలో వర్షాధార భూముల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు కురిపిస్తోంది. సంప్రదాయ పంటల కంటే డ్రాగన్ ఫ్రూట్ లాభదాయకంగా ఉండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉష్ణజాతికి చెందిన (ఏడారి మొక్క) డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో ఆశాజనకంగా ఉంటుంది. అధిక పోషక విలువలు ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పండు కిలో ధర నాణ్యతను బట్టి రూ. 150 నుంచి రూ. 200 వరకు పలుకుతోంది. దీంతో రైతులు దీని సాగుపై మక్కువ చూపుతున్నారు. ఉమ్మిడి విశాఖ జిల్లాలో సుమారు 50 ఎకరాల్లో సాగవుతోంది. అనకాపల్లి జిల్లాలో సుమారు 20 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. వీటిలో వైట్, రెడ్ రకాలు ఉన్నాయి. పంట వేసిన ఏడాది తర్వాత నుంచి దిగుబడి ప్రారంభమై దీర్ఘకాలం 25 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. ఏటా దిగుబడి పెరుగుతూ ఉంటుంది. సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేస్తే మరింత అధిక దిగుబడి వస్తుంది. ఈ పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. ఏటా జూన్ నుంచి అక్టోబర్ మధ్య పండు దిగుబడి వస్తుంది.

అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ, అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, కోటవురట్ల, ఎస్.రాయవరం, పరవాడ, మాకవరపాలెం, రావికమతం తదితర మండలాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారు.

సాగు విధానం..

త్వరగా ఎత్తు పెరిగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కకు నిటారుగా ఎదగడానికి సిమెంట్ స్తంభాలను సపోర్ట్‌గా ఏర్పాటు చేయాలి. ఈ స్తంభాలపైన మొక్కలు అల్లుకునేందుకు వీలుగా గుండ్రటి, చతురస్రాకారంతో గొడుగుల్లాగా మొక్కలు పెరిగేలా సిమెంట్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. ఏడు అడుగుల సిమెంట్ స్తంభాలను తీసుకొని రెండు అడుగుల లోతు భూమిలో పాతాలి. ఎకరాకు 450 నుంచి 500 వరకు స్తంభాలు ఏర్పాటు చేసి 1800 నుంచి 2వేల వరకు మొక్కలు నాటాలి. దీని సాగుకు తొలి ఏడాది మాత్రమే ఖర్చు ఉంటుంది. ఎకరాకు రూ. 4 నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

అధిక పోషక విలువలతో పాటు రుచికరంగా ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్‌ను తినేందుకు ఇష్టపడతారు. పోషకాల స్టోర్ హౌస్‌గా పిలిచే డ్రాగన్ పండు ధర అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌ను తరుచూ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండడంతో పాటు గుండె జబ్బులు రాకుండా నివారిస్తుంది. క్యాన్సర్, సుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా నివారిస్తుంది. మంచి కొలస్ట్రాల్‌ను, రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది.



దేవరాపల్లి మండలం ఎస్.జి. నగరంలో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంట



రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను



హైదరాబాద్‌లో ఒక్కో మొక్కను రూ. 80 చొప్పును కొనుగోలు చేశాను. రెండున్నర ఎకరాల్లో పంట వేశాను. సాగు సమయంలోనే ఖర్చు అధికంగా ఉంటుంది. ఏడాది తర్వాత దిగుబడి ప్రారంభమై సుమారు 25 ఏళ్ల వరకు వస్తుంది. ఏడాదిలో నాలుగు నెలలు పండుతుంది. వారానికి 1500 కిలోల పండ్ల దిగుబడి లభిస్తుంది. విశాఖ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాం, కొందరు వ్యాపారులు మా వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్‌కు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే సాగు మరింత పెరుగుతుంది.

– చిరికి అప్పలనాయుడు, ఎస్.జి.నగరం.

మంచి డిమాండ్



ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 12 మండలాల్లో సుమారు 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఉద్యాన వనశాఖ నుంచి హెక్టార్‌కు రూ.30 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నాం. వర్షాధార భూములు సాగుకు అనుకూలం. సాగు చేసే రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– జి.ప్రభాకర్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, అనకాపల్లి

వైఎస్సార్‌సీపీ నేతల ఔదార్యం



రోగికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయటౌన్: గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న రోగికి అరకులోయ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను అందించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అనంతగిరి మండలంలోని కివర్ల పంచాయతీ బొంగిజా గ్రామానికి చెందిన 14వ క్లస్టర్ వలంటీర్ సెంబి సన్యాసమ్మ గత 8 నెలలుగా గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొంది, స్వ గ్రామంలో ఉంటున్నారు. ప్రస్తుతం ఆమెకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటు అరకులోయ ఏరియా ఆస్పత్రిలో వైద్యం కోసం చేరారు. ఆమెకు ఆక్సిజన్ కాన్సంటేటర్ అవసరమని వైద్యులు గుర్తించారు. ఆమె ఆర్థిక పరిస్థితులు బాగోలేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆక్సిజన్ కాన్సంటేటర్ కొనుగోలు చేసి సన్యాసమ్మకు అందజేయాలని నాయకులకు సూచించారు. దీంతో రూ. 9,999 విలువ చేసే ఆక్సిజన్ కాన్సంటేటర్‌ను కొనుగోలు చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సన్యాసమ్మకు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్ కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎల్.బి.భీమరాజు, నాయకులు మొష్యా రంజిత్ కుమార్, పాంగి నాగేశ్వరరావు, అజయ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఒరిజనల్ మెమోలు పంపిణీ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజనల్ మెమోలను కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ ఆదివారం పంపిణీ చేశారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో నిర్వహించిన ఇంటర్మీయెట్ వార్షిక, అడ్వాన్స్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు షార్ట్ మెమోలను మాత్రమే అందజేశారు. వీటితోనే డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అయితే భవిష్యత్ అవసరాలకు ఒరిజనల్ మెమో అవసరం దృష్ట్యా వీటిని విద్యార్థులకు అందించేలా ఇంటర్మీడియెట్ బోర్డు వీటిని ముద్రించి ఆర్‌ఐవో కార్యాలయానికి సరఫరా చేసింది. ఉమ్మడి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 378 కాలేజీల నుంచి పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సకాలంలో అందించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటి పంపిణీ ప్రారంభించామని ఆర్‌ఐవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, మురళీ పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నలుగురి గంజాయి నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

24 కిలోలు, రూ.45 వేలు స్వాధీనం

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అర్జునగిరి గ్రామం వద్ద అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను ఆదివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 24 కిలోల గంజాయి, రూ.45 వేలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మాడుగుల మండలం ఎం. కోటపాడుకు చెందిన శానాపతి రమేష్, అర్జునగిరికి చెందిన గంజి సింహాచలంనాయుడు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చారు. వీరు అర్జునగిరి వద్ద తమిళనాడు రాష్ట్రం చెన్నై సమీపంలోని ఎర్నూర్‌కు చెందిన ఎస్. దీపక్, తిరువళ్లూరు చెందిన ఎస్. భరత్‌లకు విక్రయిస్తుండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చీడికాడ ఎస్‌ఐ పి. రామారావు తెలిపారు.

శాటిలైట్ విజ్ఞానానిదే భవిష్యత్

- డీఆర్‌డీఏ డైరెక్టర్ శ్రీనివాసరావు
- ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు

తగరపువలస: భవిష్యత్‌లో ప్రాథమిక శాస్త్రాలకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతుందని డీఆర్‌డీవో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. షార్, ఇస్రో, రఘు విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో యువత రాణించాలన్నారు. భారత ప్రభుత్వం స్టార్టప్ ఇండియాతో యువతను పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణకర్తలుగా తీర్చిదిద్దుతోందన్నారు. అంతరిక్ష ప్రయోగాల విజయాలు, నావిగేషన్, కమ్యూనికేషన్ రంగాలను ప్రభావితం చేసిన విధానం గురించి వివరించారు. దృశ్య మాధ్యమ ప్రసా రాలు, టెలిఫోన్‌లో వచ్చిన మార్పులకు కారణమైన శాటిలైట్ విజ్ఞాన ఉపయోగాలపై మాట్లాడారు. శాటిలైట్ విజ్ఞానానిదే భవిష్యత్ అని.. ఇది మానవ జీవన విధానాన్ని మార్చివేసిందన్నారు. షార్–ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ యువతలో అంతరిక్ష విజ్ఞానం పట్ల ఉత్సాహం, ఆసక్తి పెరిగిందన్నారు. భవిష్యత్తులో మన దేశానికి ఆదాయ వనరుగా అంతరిక్ష పరిశోధన రంగం నిలుస్తుందన్నారు. చంద్రయాన్, ఆదిత్య ప్రయోగాలు భారత అంతరిక్ష పరిశోధన శక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చైతన్యం పెంచే దిశగా వారోత్సవాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకత అబ్బురపరిచిందన్నారు. వారి ఆలోచనలు కూడా తమను మరింతగా ఆలోచింపజేశాయన్నారు. వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘును అభినందించి.. షార్ తరఫున ప్రశంసాపత్రం అందించారు. రఘు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగమైన షార్ శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. షార్ ప్రతినిధి హరికృష్ణ, ఎస్ఎస్టీఎల్ శాస్త్రవేత్త ఆర్.వి.ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ కృషి, లిక్విడ్ స్టేజెస్ ఆఫ్ రాకెట్లు, లూనార్ వెహికల్స్, శానిలైట్ పనిచేయు విధానం, పనితీరు, రాకెట్ల తయారీ, స్పేస్ మిషన్ వంటివి ఆలోచింపజేశాయి. ముగింపు వేడుకల్లో రఘు విద్యా సంస్థల విద్యార్థిని చేసిన శాస్త్రీయ నృత్యం విశేషంగా అలరించింది.

బ్రహ్మోత్సవాలకు మురళీనగర్ కోలాట బృందం



బ్రహ్మోత్సవాలకు ఎంపికైన కోలాటం బృందం

మురళీనగర్: తిరుమల తరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీనుంచి రెండు రోజుల పాటు నిర్వహించన్ను శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శనకు మురళీనగర్ మహిళా కోలాట బృందం ఎంపికైంది. ఈ బృందంలోని 23 మంది సభ్యులు కోలాటం శిక్షకురాలు రూపా ఆధ్వర్యంలో తమ కళారూపాలను ప్రదర్శిస్తారు. ఈ మేరకు బృంద సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. దేవదేవుడి సమక్షంలో తమకు కోలాటం ప్రదర్శించే అవకాశం రావడం తమ పూర్వ జన్మసుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.

అలరించిన డాగ్ షో





బీచ్‌రోడ్డు: దేశ, విదేశీ విభిన్న జాతుల శునకాలతో ఎంజీఎం గ్రౌండ్ కోలాహలంగా మారింది. విశాఖ కెనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డాగ్ షో నగర ప్రజలను విశేషంగా అలరించింది. షోలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి 250 శునకాలను వాటి యజమానులు ఇక్కడకు తీసుకొచ్చారు. ఇందులో 45 బ్రీడ్ జాతుల కుక్కలు ఉన్నాయి. చిట్టి పొట్టి పప్పీలు తెగ ముద్దొచ్చాయి. ముచ్చటైన విదేశీ వెరైటీ శునకాలు చూపు తిప్పుకోనివ్వకుండా ఆకర్షించాయి. షోలో భాగంగా శునకాలు తమ ప్రతిభను చూపిస్తూ.. నువ్వా నేనా అన్నట్లు ప్రదర్శన సాగించాయి. ఫ్యాషన్ వాక్, గేమ్స్, డ్యాన్సులు చేసి సత్తా చాటాయి. గెలుపొందిన శునకాలకు కిరీటంతో పాటు బహుమతులు అందజేశారు.

'డిజిలాకర్'లోనే ధ్రువపత్రాలు

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: విద్యార్థులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో పొందవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. డిజిలాకర్ వల్ల కలిగే ఉపయోగాలపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదివారం విశాఖలోని ఆర్‌ఐవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్ బోర్డు ముద్రించిన డిజిలాకర్ వాల్ పోస్టర్లను ఆర్‌ఐవో ఆవిష్కరించి.. కాలేజీల ప్రిన్సిపాళ్లకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కాలేజీల్లో డిజిలాకర్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఒరిజినల్ మార్కుల మెమోలను ఇక నుంచి డిజిలాకర్ ద్వారానే పొందవచ్చన్నారు. విద్యార్థులు కాలేజీలు, కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, తమ వద్ద ఉన్న మొబైల్ ద్వారా వీటిని పొందవచ్చని సూచించారు. ప్రతీ విద్యార్థి తమ మొబైల్‌లో డిజిలాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీనిపై కాలేజీల్లో విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలన్నారు. ఒరిజినల్ పాస్ మెమోలు పోగొట్టుకున్నా.. డిజిలాకర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని, వాటిని భవిష్యత్ అవసరాలకు ఉపయోగించవచ్చన్నారు. విద్యార్థులకు ఉపయోకరంగా ఉండేలా ప్రభుత్వం విద్యాశాఖలో డిజిటైజేషన్‌కు ప్రాధాన్యమిస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



డిజిలాకర్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఐవో

జూలో ఉత్సాహంగా మారథాన్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 2న ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌లో నగంలో పలు సంస్థలు నుంచి పెద్ద సంఖ్యలో వృద్ధులు, యువతీయువకులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొని జూలో సందడి చేశారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచినవారికి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను క్యూరేటర్ నందనీ సలారియా అందజేశారు. అనంతరం కోతుల జోన్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఇటీవల నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ఆమె అందజేశారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా